క్లుప్తంగా

టీచర్లను సర్దుబాటు చేయాలి

కడెం: విద్యార్థి, టీచర్ల నిష్పత్తి ప్రకారం ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియను తిరిగి కలెక్టర్ ప్రారంభించాలని ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు భూక్యా రాజేశ్ నాయక్ డిమాండ్ చేశారు. గురువారం కడెంలో మాట్లాడారు. ఎస్టీటీలు పదోన్నతిపై వెళ్లడంతో 600కు పైచిలుకు ప్రాథమిక పాఠశాల్లో ఉపాధ్యాయుల కొరత ఏర్పడిందన్నారు. జీవో ఎంఎస్ నెంబర్ 25 ప్రకారం సర్దుబాటు చేపట్టాలని కోరారు. ఇందులో ఆ సంఘం నాయకులు తదితరులున్నారు.

వర్షంలోనే మరమ్మతులు



తీగలకు మరమ్మతు చేస్తున్న సిబ్బంది

కడెం: మండలంలోని పెద్దూర్‌లో విద్యుత్ తీగలకు పిచ్చిమొక్కలు చుట్టుకోవడంతో గురువారం మంటలు చెలరేగి మూడు తీగలు తెగిపోయాయి. స్థానికుల సమాచారంతో విద్యుత్ సిబ్బంది మహేశ్, యాదగిరి, గంగన్న అక్కడికి చేరుకుని వర్షంలోనే మరమ్మతులు చేసి సరఫరా పునరుద్ధరించారు. వర్షంలో మరమ్మతులు చేసిన సిబ్బందికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆకట్టుకున్న నాటక ప్రదర్శన



నాటకం ప్రదర్శిస్తున్న కళాకారులు

కుభీర్: మండలకేంద్రంలో బుధవారం రాత్రి భజరంగబలి యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండపం వద్ద ప్రదర్శించిన భక్తప్రహ్లాద నాటకం అలరించింది. భైంసా మండలంలోని దేగాం, హీలేగాం తానూరు మండలంలో బోల్సా గ్రామాల కళాకారులు వివిధ వేషధారణలో ఆకట్టుకున్నారు. యూత్ సభ్యులు ఏశాల దత్తాత్రి, దత్తు, అంజు మధు తదితరులు ఉన్నారు.

అనారోగ్యంతో ఆయా మృతి



పద్మ (ఫైల్)

దస్తురాబాద్: మండలంలోని గొడిసిర్యాల పంచాయతీ పరిధి గొండుగూడ గ్రామానికి చెందిన పద్మ అనే అంగన్‌వాడీ ఆయా(35) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందింది. గ్రామస్తుల వివరాల ప్రకారం.. పద్మ గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఆసుపత్రుల్లో చికిత్స పొందినా నయం కాలేదు. దీంతో పరిస్థితి విషమించి గురువారం మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు.

భైంసాలో 163 సెక్షన్ అమలు

భైంసాటౌన్: దేవీ నవరాత్రోత్సవాల సందర్భంగా పట్టణంలో 163 బీఎన్ఎస్ సెక్షన్ అమలులో ఉంటుందని తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలో ట్రాఫిక్ ఇబ్బందులు, ప్రజలకు అసౌకర్యాలు కల్గకుండా ఈ సెక్షన్ అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పట్టణ ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

అవార్డు గ్రహీతకు ఎమ్మెల్యే సన్మానం



శివకృష్ణను సన్మానిస్తున్న ఎమ్మెల్యే బొజ్జు

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ నివాసి, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత చిలుకూరి శివకృష్ణను గురువారం ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఘనంగా సన్మానించారు. జగిత్యాలరూరల్ మండలం కండ్లపల్లి మోడల్ స్కూల్‌లో పని చేసే శివకృష్ణ ఇటీవల హైదరాబాద్‌లో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును స్వీకరించారు. ఉట్నూర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఉపాధ్యాయుడిని అభినందించి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవికుమార్, మేస్రం బాదు ఉన్నారు.

బతుకమ్మ వేడుకలు



బతుకమ్మ ఆడుతున్న మహిళలు

తానూరు: మండలంలోని భోసి గ్రామంలో గురువారం బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి గౌరమ్మకు పూజలు చేశారు. అనంతరం మహాదేవుడి ఆలయ ప్రాంగణంలో బతుకమ్మలను ఉంచి ఆడిపాడారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు రోగుల్ బాలాజీ, ఉపాధ్యక్షుడు గంగాధర్ తదితరులు ఉన్నారు.



కలెక్టర్ క్యాంపు కార్యాలయం వద్ద చెట్లతో ఫుట్‌పాత్



నిర్మల్ క్లబ్ ఎదుట ఫుట్‌పాత్‌పై హోటల్ వ్యర్థాలు



గాంధీపార్కు ఎదుట..

ఫుట్‌పాత్ ఇలా.. నడిచేదెలా?

పాదచారులు రాకపోకలు సాగించేందుకు జిల్లాకేంద్రంలోని ప్రధాన రోడ్లకు ఇరువైపులా 2021లో రూ.5 కోట్ల ఖర్చుతో నిర్మించిన ఫుట్‌పాత్ అధ్వానంగా మారింది. మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఫుట్‌పాత్ ఎక్కడికక్కడ కుంగి గుంతలు ఏర్పడ్డాయి. దీంతో బాటసారులకు దారి ఉండటం లేదు. మరోవైపు బస్టాండ్ ప్రాంతంలో ఫుట్‌పాత్‌లను చిరువ్యాపారులు ఆక్రమించుకొని వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. అధికారులు స్పందించి దెబ్బతిన్న ఫుట్‌పాత్‌లకు మరమ్మతులు చేపట్టి.. ఆక్రమణలు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్



బస్టాండ్ ప్రాంతంలో ఆక్రమణలు

ఈరోజు

కంటి వైద్యశిబిరం

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాకేంద్రంలోని పెన్షనర్ల సంఘ భవనంలో శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం గ్లోబల్ సూపర్ స్పెషాలిటీ హైదరాబాద్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంసీ లింగన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 గంటలకు నిర్వహించే శిబిరాన్ని పెన్షనర్లు, వారి కుటుంబసభ్యులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పరీక్షల అనంతరం అవసరమైన వారికి ఆపరేషన్లు చేయనున్నట్లు పేర్కొన్నారు.

ఎమ్మెల్యే పర్యటన

సారంగాపూర్: మండలంలో శుక్రవారం నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి పర్యటించనున్నట్లు బీజేపీ మండల అధ్యక్షుడు నరేశ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆలూరులో ఉదయం 11గంటలకు చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణ, లిఫ్ట్ ఇరిగేషన్ పునరుద్ధరణ పనులకు శంకుస్థాపన, సాయంత్రం స్వర్ణ ప్రాజెక్టుపై లైటింగ్‌ను ప్రారంభిస్తారని పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

మామడ: మండలంలోని పొన్కల్, మామడ గ్రామాల్లో ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి పర్యటించనున్నట్లు బీజేపీ మండల కన్వీనర్ రంజిత్‌కుమార్ తెలిపారు. పొన్కల్ సదర్మాట్ బ్యారేజీ వద్ద నాగదేవత ఆలయం నిర్మాణానికి శంకుస్థాపన చేసి మామడలో శివాజీ విగ్రహం ఆవిష్కరిస్తారని పేర్కొన్నారు.

రోడ్లకు మరమ్మతులెప్పుడో!

- భారీవర్షాలకు దెబ్బతిన్న దారులు
- రాకపోకలకు గోస పడుతున్న ప్రజలు
- పలుచోట్లకు నిలిచిపోయిన ఆర్టీసీ సేవలు

తానూరు: ఇటీవల కురిసిన భారీవర్షాలకు తానూరు మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రోడ్లు కోతకు గురయ్యాయి. పలుచోట్ల గుంతలు ఏర్పడ్డాయి. దీంతో రాకపోకలు సాగించే ప్రజలు, వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టకపోవడంతో ఎప్పుడేం ప్రమాదం చోటు చేసుకుంటుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులు, పాలకులు రోడ్లకు మరమ్మతులు చేపట్టి.. సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

బెల్‌తరోడా నుంచి తానూరు వెళ్లే మార్గంలో సట్వాజీ వాగు వంతెన వద్ద రోడ్డు ఇరువైపుల కోతకు గురైంది. దీంతో భైంసా ఆర్టీసీ అధికారులు తానూరు మీదుగా మహారాష్ట్రలోని కర్మెలి వెళ్లే బస్సును 15 రోజులుగా నిలిపివేశారు. భైంసా నుంచి తానూరుకు గ్యాస్ సిలిండర్లను తీసుకెళ్లే వాహనాలు గ్రామాల్లోకి రావడం లేదు. ఆటోలు, బైక్‌లపైనే రాకపోకలు సాగిస్తున్నారు. బస్సు రాక కళాశాల విద్యార్థులు, పనులకు వెళ్లే మహిళలు ఇబ్బంది పడుతున్నారు. దీంతో ఆటో డ్రైవర్లు అధిక చార్జీలు వసూలు చేస్తున్నారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు.

ఉమ్రి(కే)–ఇలేగాం రోడ్డు మార్గంలో..

ఉమ్రి(కే) నుంచి ఇలేగాం వెళ్లే మార్గంలో వాగ్దాటి వాగు సమీపంలో రోడ్డు కోతకు గురైంది. పెద్ద వాహనాలు కాకుండా ఆటోలు, బైక్‌లపై మాత్రమే ప్రయాణం సాగిస్తున్నారు. ఈ మార్గంలో భైంసా నుంచి ఉమ్రి(కే), బోరిగాం, బెంబర గ్రామాల ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణం చేస్తున్నారు.

ప్రమాదకరంగా దౌలతాబాద్ రోడ్డు..

ముథోల్ ఎక్స్‌రోడ్డు నుంచి దౌలతాబాద్ వెళ్లే మార్గంలో వాగును ఆనుకొని ఉన్న రోడ్డు కోతకు గురైంది. ఈ మార్గంలో రాకపోకలు సాగించే ఖర్బాలా, జౌలా(బి), తొండాల గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. బెంబర గ్రామ సమీపంలో వంతెన వద్ద రోడ్డు కోతకు గురైంది.

రోడ్లను పరిశీలించని అధికారులు

భారీవర్షాలకు దెబ్బతిన్న రోడ్లను పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ అధికారులు ఇప్పటికీ పరిశీలించలేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఇబ్బంది పడుతున్నామని విన్నవించినా పట్టనట్లు వ్యవహరిస్తున్నారని వాహనదారులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



సట్వాజీ వాగు సమీపంలో వంతెన వద్ద కోతకు గురైన రోడ్డు



బెంబర గ్రామ సమీపంలో దెబ్బతిన్న రోడ్డు



దౌలతాబాద్ రోడ్డు దుస్థితి..

టెండర్లు పూర్తయ్యాయి

తానూరు మండలంలో బెల్‌తరోడా సట్వాజీ వాగు సమీపంలో ఇరువైపుల కోతకు గురైన రోడ్డు మరమ్మతుల కోసం టెండర్లు పూర్తయ్యాయి. నాలుగు రోజుల్లో పనులు చేపటి ప్రయాణికుల సమస్యలు పరిష్కరించేలా చూస్తాం.

– సునీల్, డీఈ, ఆర్‌అండ్‌బీ

శాంతిభద్రతల పరిరక్షణకే కార్డన్‌సెర్చ్

లక్ష్మణచాంద: శాంతిభద్రతల పరిరక్షణ కోసం కమ్యూనిటీ కాంటాక్ట్ (కార్డన్‌సెర్చ్) నిర్వహిస్తున్నట్లు సోన్ సీఐ గోవర్దన్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని రాచాపూర్‌లో గురువారం ఉదయం పోలీసుల ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ సైబర్ నేరాలు, ట్రాఫిక్ సమస్యలు, గంజాయి, మత్తు పదార్థాలతో కలిగే దుష్పరిణామాలను గ్రామస్తులకు వివరించారు. పత్రాల్లేని 52 బైక్‌లు, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నారు. పెండింగ్ చలాన్లు పరిశీలించి జరిమానాలు విధించినట్లు పేర్కొన్నారు. సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. లక్ష్మణచాంద, మామడ ఎస్సైలు శ్రీనివాస్, అశోక్, 30 మంది సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

నిగ్వాలో..

కుభీర్: మండలంలోని నిగ్వా గ్రామంలో పోలీసులు కార్డన్‌సెర్చ్ (కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం) నిర్వహించారు. సరైన పత్రాలు లేని 120 బైకులు, నాలుగు ఆటోలను సీజ్ చేశారు. ఈసందర్భంగా భైంసారూరల్ సీఐ నైలు సైబర్ మోసాలు, సీసీ కెమెరాల ప్రయోజనాలను వివరించారు. ప్రతి ఒక్కరూ వాహనపత్రాలు వెంట ఉంచుకోవాలని సూచించారు. కుభీర్ ఎస్సై కృష్ణారెడ్డి, కుంటాల, భైంసా పోలీసులు తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న సీఐ గోవర్ధన్‌రెడ్డి

యూరియా కోసం వర్షంలోనూ క్యూ



దస్తురాబాద్: రికార్డును పరిశీలిస్తున్న తహసీల్దార్

దస్తురాబాద్: సరిపడా యూరియా బస్తాలు నిల్వలు ఉన్నాయని రైతులెవరూ ఆందోళన చెందవద్దని తహసీల్దార్ విశ్వంభర్ పేర్కొన్నారు. మండలకేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయానికి 450 యూరియా బస్తాలు వచ్చాయని తెలిసి గురువారం మండలంలోని రైతులు తరలివచ్చారు. తహసీల్దార్ విశ్వంభర్ కార్యాలయానికి వచ్చి రికార్డులు పరిశీలించారు. ఏఈవో తిరుపతి, రైతులు తదితరులు ఉన్నారు.



కడెంలో పీఏసీఎస్ ఎదుట బారులు తీరిన రైతులు

కడెం: మండలకేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయం ఎదుట యూరియా బస్తాల కోసం రైతులు గురువారం వర్షంలోనూ క్యూ కట్టారు. 20 రోజులుగా యూరియా కోసం ఇబ్బంది పడుతున్నామని.. ప్రభుత్వం రైతులకు సరిపడా యూరియా అందించాలని రైతులు డిమాండ్ చేశారు.

‘డబుల్’ ఇళ్లకు పట్టాలు ఇవ్వాలి

ఖానాపూర్: పట్టణంలోని కుమురం భీం చౌరస్తాలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లలో నివాసం ఉంటున్న వారికి ప్రభుత్వం వారం రోజుల్లో ఇళ్ల పట్టాలను పంపిణీ చేయాలని సీపీఐఎంఎల్ మాస్లైన్ జిల్లా కార్యదర్శి నంది రామయ్య డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని జగన్నాథ్‌రావు చౌరస్తా నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు కాలనీవాసులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. తమకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇళ్లను కేటాయించిందన్నారు. కాలనీలో సీసీ రోడ్లు, విద్యుత్ స్తంభాలు, పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, ఆస్పత్రి, సెల్‌టవర్లను ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ సుజాతకు వినతిపత్రం అందజేశారు. కాలనీవాసులు గీస లక్ష్మి, ముత్తన్న, హైమద్, నుస్రత్, పద్మ, ప్రభాకర్, సమీ, వంశీధర్, శ్రీనివాస్, గంగన్న, తదితరులు ఉన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

ప్రశాంతంగా ‘ఓపెన్’ పరీక్షలు

నిర్మల్‌టౌన్: తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఓపెన్ పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు, తెలంగాణ ప్రభుత్వ పరీక్షల విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డీఈఈడి పరీక్షలు నిర్మల్‌లో ప్రశాంతంగా నిర్వహించినట్లు డీఈవో భోజన్న గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం జరిగిన పదో తరగతి పరీక్షలకు 202 మందికి గాను 170 మంది హాజరవగా.. ఇంటర్ పరీక్షలకు 29 మందికి గాను 16 మంది హాజరైనట్లు పేర్కొన్నారు. డీఈడీ పరీక్షలకు 53 మందికి గాను 51 మంది హాజరవగా మధ్యాహ్నం జరిగిన ఓపెన్ ఇంటర్ పరీక్షలకు 17 మందికి గాను ఆరుగురు గైర్హాజరైనట్లు వివరించారు.

వైద్యపరీక్షలకు ముందుకురావాలి

లక్ష్మణచాంద: మహిళలు వైద్యపరీక్షలు చేయించుకునేందుకు ముందుకురావాలని వైద్యాధికారి రవీనా అన్నారు. స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ కార్యక్రమంలో భాగంగా మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యురాలు ప్రత్యూష కంటి పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈసందర్భంగా జాగ్రత్తలను వివరించారు. సిబ్బంది లక్ష్మీకాంత్, సిబ్బంది శివకృష్ణగౌడ్, పద్మావతి, ఉమా పాల్గొన్నారు.

కుంటాల: స్వస్థ్ నారి సశక్త్ పరివార్ కార్యక్రమంలో భాగంగా గురువారం కుంటాల పీహెచ్‌సీలో వైద్యురాలు సుమలత పలువురికి గుండె, మధుమేహం, రక్తహీనత పరీక్షలు నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత, విజయలక్ష్మి, స్టాఫ్ నర్స్ సంతోషిని, ఏఎన్ఎంలు సక్కుబాయి, సుజాత, సుచరిత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కుంటాలలో అవగాహన కల్పిస్తున్న సుమలత

ఘనంగా దీన్‌దయాళ్ జయంతి

ఖానాపూర్: పట్టణంలోని జగన్నాథ్‌రావు చౌరస్తాలో బీజేపీ ఆధ్వర్యంలో గురువారం పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి నిర్వహించారు. అనంతరం బీజేపీ నాయకులు పలు చోట్ల మొక్కలు నాటారు. అంకం మహేందర్, రవీందర్‌రెడ్డి, కీర్తి మనోజ్, అనిల్‌రావు, పవన్, రమేశ్, శ్రీనివాస్, నారాయణ, రవీందర్ తదితరులు ఉన్నారు.

కుంటాల: మండలంలోని కొత్తవెంకూర్, లింబా(కె) గ్రామాల్లో బీజేపీ ఆధ్వర్యంలో పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి నిర్వహించారు. అనంతరం మొక్కలు నాటారు. బీజేపీ మండల సూర్యవంశీ, బాజీరావు, సాయినాథ్ పటేల్, నవీన్ పాల్గొన్నారు.



ఖానాపూర్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు

అలరించిన ప్రదర్శనలు

భైంసాటౌన్: పట్టణంలోని గణేశ్‌నగర్ శ్రీరామ చైతన్య యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండపం వద్ద గురువారం సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలోని గుజిరిగల్లి శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాల విద్యార్థుల భక్తి గీతాలాపనలు, నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం యూత్ సభ్యుల ఆధ్వర్యంలో చిన్నారులకు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థికి సన్మానం

లోకేశ్వరం: మండలంలోని బామ్ని(కే) గ్రామానికి చెందిన మనోజ్‌కుమార్ నీట్ ఫలితాల్లో ప్రతిభ కనబర్చి మెడికల్ సీటు సాధించారు. గురువారం బామ్ని(కే)లోని మున్నూరుకాపు సంఘ భవనంలో మనోజ్‌కుమార్‌ను తాలుక మున్నూరుకాపు పెద్దలు ఎనుపోతుల మల్లేశ్, కొట్టే హనుమాన్లు, ఆకుల సంజీవ్ తదితరులు సన్మానించారు. అనంతరం పోట్‌పల్లి (ఎం), కన్కపూర్, బామ్ని(కే) గ్రామాల్లో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి పలు విషయాలు చర్చించారు. కులస్తులు ధర్మపురి, సేనాపతి, ప్రశాంత్, శ్రీనివాస్, భోజన్న, నరేశ్, పోశెట్టి ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

నేడు పోషకుల సమావేశం

తానూరు: మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల పోషకుల సమావేశం నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఫణి రాజేశ్వర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల హాజరు, మార్కుల ప్రగతి వివరాలు తెలుపుతామని పేర్కొన్నారు. ఆహ్వాన పత్రాలు అందించామని.. పోషకులు రావాలని కోరారు.

పరామర్శ

లక్ష్మణచాంద: మండలంలోని నర్సాపూర్‌లో మాజీ ఎంపీటీసీ గణేశ్ తల్లి లక్ష్మిబాయి ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలిసి డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఒడ్నాల రాజేశ్వర్, ఏఎంసీ వైస్ చైర్మన్ ఈటెల శ్రీనివాస్, ఆత్మ కమిటీ చైర్మన్ రాంరెడ్డి, సీరాజ్, గంగాధర్ తదితరులు ఉన్నారు.

బైక్ చోరీ

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని ఈద్గాంలో దుండగులు గురువారం తెల్లవారుజామున ఓ బైక్ చోరీ చేశారు. షహెబాజ్ అనే చిరువ్యాపారి తన ఇంటి వద్ద బైక్‌ను నిలిపాడు. తెల్లారుజామున బైక్‌పై దొంగలు వచ్చి షహెబాజ్ బైక్‌ను ఎత్తుకెళ్లారు. ఆ దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. వాహన యజమాని పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ప్రభురావ్ పాటిల్ వర్ధంతి

నర్సాపూర్(జి): మండలంలోని కుస్లీ గ్రామంలో గురువారం మాజీ సర్పంచ్ నర్వాడే ప్రభురావ్ పాటిల్ ఎనిమిదో వర్ధంతి నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులు, నర్వాడే శివాజీ పాటిల్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

బాబా ఆలయంలో పూజలు

కుంటాల: మండలంలోని కల్లూరు సాయిబాబా ఆలయంలో గురువారం భక్తులు పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు



కుంటాల: అంబకంటిలో హారతులతో భక్తులు

దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. గురువారం అమ్మవారు భక్తులకు వివిధ రూపాల్లో దర్శనమిచ్చింది. ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు. అనంతరం మండపాల వద్ద భక్తులకు అన్నదానం చేశారు. – సాక్షి నెట్‌వర్క్



ఖానాపూర్: మస్కాపూర్‌లో..



భైంసారూరల్: కుంసరలో మండపం వద్ద భక్తులు



లక్ష్మణచాంద: పొట్టపెల్లిలో ..

ప్రజలతో మర్యాదగా ప్రవర్తించాలి

నర్సాపూర్(జి): పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులు, ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించాలని భైంసా ఏఎస్పీ రాజేశ్‌మీనా సూచించారు. గురువారం నర్సాపూర్(జి) మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. స్టేషన్ రికార్డులు పరిశీలించి పెండింగ్ కేసుల వివరాలను తెలుసుకున్నారు. రికార్డుల నిర్వహణ, స్టేషన్ పరిసరాలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటి సంరక్షించాలని సిబ్బందికి సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణ, మహిళల రక్షణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. నిర్మల్‌రూరల్ సీఐ కృష్ణ, ఎస్సై గణేశ్, సిబ్బంది పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న ఏఎస్పీ రాజేశ్ మీనా